క్లుప్తంగా

'కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అల్లిపురం: విశాఖ డెయిరీలో 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా తొలగించడాన్ని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. బుధవారం కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పర్మినెంట్ యూనియన్ నాయకుల అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ గౌరవాధ్యక్షుడు రాంబాబు, రాజేంద్ర ప్రసాద్, లోకేష్, డెయిరీ కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీ సమావేశం

అల్లిపురం: వినాయక మండపాల నిర్వాహకులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గల టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి నగరంలో వినాయక పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి వినాయక ఉత్సవాలు నిర్వహించదలచిన నిర్వాహకులు, కమిటీ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా నేరం



కొబ్బరితోట వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు

అల్లిపురం: డ్రగ్స్, గంజాయి వినియోగించినా, విక్రయించినా నేరమవుతుందని, శిక్షార్హులవుతారని టూటౌన్ ట్రాఫిక్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కొబ్బరితోటలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించి యువత తమ ఉజ్వల భవిష్యత్ పాడు చేసుకుంటున్నారన్నారు. వార్డులో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం నేత నరసింహారావు మృతి



నరసింహారావు (ఫైల్)

మహారాణిపేట: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, ప్రముఖ బ్రాహ్మణ సంఘం నాయకుడు కేసనపల్లి నరసింహారావు (85) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు తుది శ్వాస విడిచారు. ఇతన్నే కేసనపల్లి కన్నబాబు అని కూడా అంటారు. ఈయన బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కాలం పనిచేశారు. ఆయన పార్థివదేహాన్ని గ్రీన్ పార్క్ హోటల్ సమీపంలోని ఇంటి వద్ద ఉంచారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింహారావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్, విశాఖ జిల్లా బ్రాహ్మణ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె. చరణ్ కుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు నరసింహారావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ద్రోణంరాజు కుటుంబానికి నరసింహారావు అత్యంత సన్నిహితులు.

భవిత కేంద్రం పిల్లలకు స్పీచ్ థెరపీ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో దివ్యాంగులకు బుధవారం స్పీచ్ థెరపీ చేయించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఈవో ఎన్.ప్రేమకుమార్ ఆదేశాలతో ఇక్కడి కేంద్రంలో 25 మంది పిల్లలకు స్పీచ్ థెరపీ నిపుణురాలు బాలేశ్వరి భాష ఉచ్చరణలో తర్ఫీదు ఇచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు ఆమె మెలకువలు నేర్పించారు. చినగదిలి ఎంఈవో - 2 అనురాధ మాట్లాడుతూ అన్ని మండలాల్లోనూ స్పీచ్ థెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అమ్మపాలు.. అమృతం

- పోతపాలతో అనారోగ్య సమస్యలు
- ముర్రుపాలలో పోషకాలు మెండు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- గర్భిణులు, బాలింతలకు అవగాహన

తల్లికి కలిగే ప్రయోజనాలు..

బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, మధుమేహం వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. ఊబకాయం నుంచి తప్పించుకోవచ్చు. గర్భధారణకు పూర్వం ఉండే బరువును మళ్లీ పొందవచ్చు. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచి గుడ్లు, చేపలు, పాలు, తాజా కూరగాయాలు, పండ్లు తీసుకోవాలి.



మిరపకాయలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్



తల్లిపాల విశిష్టతను తెలిపే వివిధ చిత్రాల చార్టులు

అల్లిపురం: నియోజకవర్గంలో అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, మిరపకాయల వీధి, చలువతోట, నేరెళ్లకోనేరు, కొబ్బరితోట 1 నుంచి 4, నేతాజీ నగర్, అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 1 నుండి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నదే వారోత్సవాల ఉద్దేశం. నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి పాలు ఎంతగానో దోహదపడతాయి. ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి. తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయి. అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయి. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే అపోహలు వీడి తప్పకుండా బిడ్డకు పాలు పట్టించాలి. పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టిస్తే సహజ రోగ నిరోధక శక్తి కలిగేలా చేస్తాయి.

అమృతంతో సమానం..

తల్లిపాలను అమృతంతో పోలుస్తారు. లేత పసుపు పచ్చ రంగుతో కూడిన పాలను బిడ్డకు ఇవ్వడం వల్ల పసికందు మెదడు చురుగ్గా పని చేయడంతో పాటు జ్ఞాపక శక్తి ఇనుమడిస్తుంది. గుండె, చర్మ సంబంధ వ్యాధులు, ఉబ్బసం, ఆస్తమా, బీపీ, షుగర్ రాకుండా చేస్తాయి. ఆరు నెలల పాటు శిశువుకు రోజుకు 12 సార్లు పాలు తాగించాలి. ఈ పాలు తాగిన పిల్లల్లో స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. కొందరు తల్లులు తమ బిడ్డలకు డబ్బా పాలు పడుతున్నారు. అలా చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

తల్లిపాలతో బిడ్డకు కలిగే ప్రయోజనాలు..

తల్లిపాలతో బిడ్డకు ప్రొటీన్లు అంది మెదడు వికసించడంతో పాటు శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుంది. బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. పాలల్లో లాక్టోజ్ ఉండటంతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. దీంతో బిడ్డ రక్తహీనత బారిన పడకుండా ఉంటుంది. తొలిదశలో శిశువును అంటువ్యాధుల నుంచి కాపాడటమే కాకుండా మనోవికాసానికి ఉపకరిస్తుంది. నిమోనియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, గుండె జబ్బులు, చెవికి సంబంధించిన వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి. పోషకాహార లోపం తగ్గి శిశు మరణాలు కూడా తగ్గే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

7వ తేదీ వరకు వారోత్సవాలు..

ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ నిర్వహిస్తోంది. ఏడు రోజుల పాటు తల్లిపాల ఆవశ్యతకపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వివరిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

తల్లికి లాభం.. బిడ్డకు క్షేమం..

ప్రసవమైన వెంటనే బిడ్డకు ఎంత తొందరగా పాలు ఇస్తే అంత మంచిది. తల్లి దగ్గరలో ఉంచడంతో బిడ్డ శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. అదే విధంగా తల్లికి పాలు రావడానికి ప్రేరణ కలుగుతుంది. తల్లీబిడ్డల మధ్య ప్రేమానురాగాలు కూడా పెరుగుతాయి. తల్లికి రొమ్ము, అండాశయ క్యాన్సర్ వంటివి రాకుండా కాపాడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ ఏర్పాటు చేసిన ట్రీ

సిరులతల్లికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 13వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యువజన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: అంతర్జాతీయ యువజన దినోత్సవం -2025 ఉత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 12న ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఇంటర్ ఫెయిత్ డైలాగ్, యూత్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంతో కొనసాగనుంది. కార్యక్రమాన్ని యోస్ వి కేస్ యువజన సంస్థ (విశాఖపట్నం), ఆర్థిక శాస్త్ర విభాగం, ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్ (భారత ప్రభుత్వం), ఏయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి.

బాబు మేనిఫెస్టో అంతా అబద్ధమే

33, 34 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం



మహిళకు బాబు మోసాలు వివరిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: బాబు మేనిఫెస్టో అంతా అబద్ధమే అని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం కొబ్బరితోట 41వ పోలింగ్ బూత్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గడప గడపకు వెళ్లి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, రాష్ట్ర నాయకులు లింగం శ్రీను, జిల్లా వాలంటరీ విభాగం ఉపాధ్యక్షుడు దూడ అప్పారావు, గోవింద్, తాతబ్బాయి, దానయ్యమ్మ, ఉమ్మిడి రాజేష్, గాలి పార్వతి, ధనరాజు, అప్పలరాజు, లక్ష్మణరావు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి బాబు హామీలు అమలు చేయని వైనం ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ నంబర్ 61 వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పచ్చిరపల్లి రాము, వెంకటేశ్వర స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, వార్డు సెక్రటరీ సంతోష్ కుమార్, మహిళా నాయకులు హేమ, కొల్లు సత్యవతి, లక్ష్మీకాంతం, బాడుగ శ్రీనివాసరావు, ధర్మ, పీఏఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బూర్ల చిన్న, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివ కుమార్, పాల దామోదరరావు, సింగంశెట్టి నాగేశ్వరరావు, రంజిత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



33వ వార్డులో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ తదితరులు

ఘనంగా దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని క్యాథడ్రల్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో 125 వసంతాల దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పారిస్ పాస్టల్ కౌన్సిల్, విచారణ గురువు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం నవ దినాల ప్రార్థనలు (నొవీనా) నిర్వహించారు. ఖమ్మం డయోసిస్‌కు చెందిన రెవరెండ్ ఫాదర్ సూరేపల్లి ఐజక్ ముఖ్య అతిథిగా హాజరై 125 వత్సరాల పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజలు చేశారు. పరిశుద్ధ బైబిల్‌లో మరియ మాతకు ఉన్న ప్రాముఖ్యతను, జూబ్లీ ఉత్సవాల చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. బెలూన్లతో తయారు చేసిన భారీ జపమాలను ఫాదర్లు గాలిలో ఎగురవేశారు. సాయంత్రం దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీప్ గుర్తు వీధి, రొసిలియన్ తదితర ప్రాంతాల్లో పల్లకీ ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



మేరీమాత స్వరూపం తేరు వద్ద జెండా ఎగురవేస్తున్న ఫాదర్లు

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం

మద్దిలపాలెం : బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్సుకి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం పలు ప్రతిపాదనలు సిద్ధం చేసి దరఖాస్తు చేశామని చెప్పారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు వీసీ రాజశేఖర్ తెలిపారు.



క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

ఘనంగా వ్యవహార్ దివస్-2025

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లో ఉన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం 'వ్యవహార్ దివస్-2025' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవనయానంలో వాణిజ్యశాస్త్రం ప్రాధాన్యత, వాణిజ్యానికి-వ్యాపారానికి మధ్య తారతమ్యం, వాటి వినియోగం గురించి వివరించారు. దీనిలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్లు, వివిధ రకాల ప్రాజెక్టులను ఆయన తిలకించి అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల రీజనల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, ఆదిత్య కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి వి.నూకరాజు, అధ్యాపకురాలు ఎన్.వాసవీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయి

ఆరిలోవ : క్రమశిక్షణ కలిగిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చినగదిలి దరి దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గృహంలో ఎంత మంది బాలురు ఉన్నారు... వారంతా ఏయే ప్రాంతాలకు చెందినవారు తదితర విషయాలు పర్యవేక్షణాధికారి రమణను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన బాలురతో మాట్లాడారు. వారి కుటుంబ నేపథ్యం తెలుసుకున్నారు. బాలురు గృహంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకోవడం వల్ల మంచి ఉద్యోగాలు సాధించి భవిష్యత్‌లో చక్కగా స్థిరపడతారన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సిబ్బంది, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు

మహారాణిపేట: ఎక్కడా మాతృ మరణాలు సంభవించరాదని, ఒక వేళ అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైద్యులు, ఏఎన్ఎంలతో మాట్లాడారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత వైద్యులు, ఇతర సిబ్బంది సమాధానం చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కారాదన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడే హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించి తగిన వైద్య సలహాలు అందించాలని తెలిపారు. టీటీ ఇంజక్షన్, ఐరన్ ఫోలిక్ మాత్రలు, ఇతర మందులు ఇవ్వాలన్నారు. గర్భిణికి సాధారణ ప్రసవం జరిగేటట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ లూసీ, డాక్టర్ విద్యారమ, డాక్టర్ షర్మిలా కుమారి, డాక్టర్ వీవీ శ్రావణ్, డాక్టర్ రమ్యచిత్ర, డాక్టర్ ఎస్.వి.సమత, విమెన్ హెల్త్ ఆఫీసర్, డాక్టర్ బి.నాయుడు, 108 జిల్లా సమన్వయ అధికారి త్రినాథరావు, యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం .సత్యవతి, డాక్టర్ ఆర్.రేవతి, డాక్టర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహిళలకూ సమాన అవకాశాలు కల్పించాలి



మహా సభలో పాల్గొన్న ఐద్వా ప్రతినిధులు

అల్లిపురం: రాజకీయ, సామాజిక రంగాల్లో పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఐద్వా జగదాంబ జోన్ 7వ మహాసభ ఎన్‌పీఆర్ భవనంలో బుధవారం జరిగింది. ఈ మహాసభకు కె.మణి అధ్యక్షత వహించగా ఐద్వా సీనియర్ నాయకులు ఎం. అన్నపూర్ణ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కార్యకలాపాల నివేదికను జోన్ కార్యదర్శి ఆర్. వరలక్ష్మి ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, బి. పద్మ మాట్లాడుతూ స్త్రీ సాధికారతకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కె. మణి, ఆర్. వరలక్ష్మి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బి.సత్యవతి, ఎం.అన్నపూర్ణ , ఎం. నాగమణి, పి.ఉమా, ఎన్.గౌరీ,కె.వరలక్ష్మి, జి.షైడిరాజు, ఎస్.పార్వతి, ఎస్.నాగలక్ష్మి, కె.సరోజినీ, పి మణి, వరలక్ష్మి, హసీనా, వరుణ, అమ్మాజీ 17 మంది తో కమిటీని ఎన్నుకున్నట్లు ఐద్వా ప్రతినిధులు తెలిపారు.


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'గైస్' విద్యార్థినుల ప్రతిభ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన బిర్లా పెయింట్స్, ఒపస్ పెయింట్స్‌కు నిర్వహించిన ఉద్యోగ నియామక ఇంటర్వ్యూల్లో వివిధ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన నలుగురు బాలికలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఎస్.చంద్రజ్యోతి (పెట్రో కెమికల్స్), ఎం.చరిష్మా (పెట్రో కెమికల్స్), ఎస్.కోమలి(కెమికల్ ఇంజినీరింగ్), కె.ప్రతిభ(ఆయిల్ టెక్నాలజీ)లకు రూ.3.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు కంపెనీ పంపించిన ఉత్తర్వులను బుధవారం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థినులను వివిధ విభాగాధిపతులు సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డాక్టర్ దామోదర్, ఎం.మహాలక్ష్మి, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, టీపీవో కేబీవీఎస్ఎస్ కుమార్ అభినందించారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థినులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

ప్రజల కోసమే కవిత్వం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్ర నగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనం శ్రోతలను అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవి ప్రజల హృదయాల్లో ఉదయిస్తాడన్నారు. ప్రజల కోసం కవులు కవిత్వం రాయాలని సూచించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వ రీతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.చినసూర్యనారాయణ, వినయ భూషణ్, కె.వి.ఎస్.మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, పరమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ తదితరులు స్వీయ కవితా పఠనం చేసి అలరించారు.